క్లుప్తంగా

పీహెచ్‌సీకి చేయూత



వైద్యశాలకు బెడ్ అందిస్తున్న దాతలు

తాళ్లూరు: వైద్యశాల అభివృద్ధికి స్థానికులు తమ వంతు చేయూత ఇవ్వడం అభినందనీయమని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రత్నం అన్నారు. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ గూడ శ్రీధర్‌రెడ్డి తన పూర్వీకుల జ్ఞాపకార్థం వైద్యశాలకు అవసరమైన ఆపరేషన్ థియేటర్ బెడ్, వీల్ చైర్‌లు శనివారం అందించారు. రిటైర్డు ఉపాధ్యాయుడు గూడ బ్రహ్మారెడ్డి, రమా కాంత్‌రెడ్డి, ఏరేసు బ్రహ్మారెడ్డిలు వస్తువులను పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రత్నానికి అందించారు.

నేడు రక్తదాన శిబిరం

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం జరుగుతుందని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

వచ్చే నెల నుంచి ప్లాస్టిక్ కవర్ల నిషేధం

దర్శి: ప్లాస్టిక్ కవర్లు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నిషేధిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ మహేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు.

డీఈ రామకృష్ణకు సన్మానం



డీఈ రామకృష్ణను సన్మానిస్తున్న సిబ్బంది

త్రిపురాంతకం: రిపబ్లిక్ డే సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ బెస్ట్ అధికారి అవార్డు అందుకున్నందుకు సిబ్బంది ఆయన్ను శనివారం ఘనంగా సన్మానించారు. త్రిపురాంతకం ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ ట్యాంకుల పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది రామకృష్ణను సన్మానించారు.

పొలం బడి.. నూతన ఒరవడి!

పొదిలి రూరల్: రైతులు మితిమీరిన పురుగు మందులు వినియోగం తగ్గించి అవసరం ఉన్నంత మేరకే ఉపయోగించాలని వ్యవసాయాధికారి ఎస్‌కే జైన్‌లుబ్దిన్ అన్నారు. శనివారం మండలంలోని అన్నవరంలో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరిలో విత్తే ముందు విత్తనానికి 10 గ్రాముల సుడోమోనాస్ లేదా కార్బండిజం 3 గ్రాములతో విత్తన శుద్ధి చేయాలన్నారు. పైరుకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపటాలని రైతులకు ఆయన సూచించారు.

కేజీబీవీకి ఎల్‌ఈడీ టీవీ బహూకరణ



టీవీ బహూకరిస్తున్న రవిశంకర్

దర్శి: స్థానిక కేజీబీవీ పాఠశాలకు డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ ఎల్‌ఈడీ టీవీ శనివారం బహూకరించారు. విద్యార్థులకు డిజిటల్ క్లాసుల కోసం టీవీ ఇస్తున్నట్లు రవిశంకర్ తెలిపారు. ప్రిన్సిపాల్ అరుణ, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



సభలో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

కురిచేడు: ఏ ఉద్యోగైనా విధులు అంకితభావంతో నిర్వర్తిస్తే గుర్తింపు ఉంటుందని త్రిపురాంతకం సీఐ రాంబాబు అన్నారు. స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీ సదా ఫౌండేషన్ కార్యాలయంలో ఉత్తమ వైద్యాధికారి పి.ప్రవీణ్‌ను ఆయన శనివారం సన్మానించారు. కార్యక్రమం ఫౌండేషన్ డైరెక్టర్ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ రోగికి డాక్టర్ దేవుడని, గ్రామీణ గర్భిణులకు డాక్టర్ ప్రవీణ్ అందించిన సేవలు ఎనలేనివన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించే భాగ్యం ఆ దేవుడు అనుగ్రహించాడని వైద్యాధికారి పి.ప్రవీణ్ అన్నారు. సదా ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు ఎం.జెమీమా, డిప్యూటీ తహసీల్దార్ రాధాకృష్ణ, పీడీసీసీ బ్యాంకు విశ్రాంత మేనేజరు జి.సుబ్బారావు, పార్వతి, హెల్త్ సూపర్‌వైజర్ విజయకుమార్ పాల్గొన్నారు.

15 ప్రాంతాల్లో అన్న వితరణ

● అల్పాహార కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: అన్నదానం మహాదానమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథ సప్తమిని పురస్కరించుకుని పట్టణంలోని నెహ్రూ బజార్, అమ్మవారి శాల, రథం బజారు, నాయుడు బజారు, అరవింద గోష్ వీధి, పాత, దోర్నాల బస్టాండ్‌ల వద్ద తదితర ప్రాంతాల్లో భక్తులకు వివిధ అసోసియేషన్‌ల వారు ఏర్పాటు చేసి అన్నవితరణ, అల్పాహార కేంద్రాలను పలుచోట్ల ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శనివారం ప్రారంభించారు. రీడింగ్ రూమ్ ఆడిటోరియంలో రథ సప్తమి సందర్భంగా ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, రీడింగ్ రూమ్ సెక్రటరీ గుంటక సుబ్బారెడ్డి ప్రారంభించారు. అధ్యక్షుడు ఐ.బాల సుబ్బారావు, కోశాధికారి పి.మల్లికార్జునరావు, షెక్షావలి, మోహన్‌రెడ్డి, శాసనాల వీరబ్రహ్మం, గుంటక వెంకటరెడ్డి, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు. రాఘవేంద్ర స్వామి గుడి వద్ద 1986–87 10వ తరగతి విద్యార్థులు సుమారు నాలుగు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. రాంబాబు, వెంకట రమణ, ఎంఆర్‌కే బాషా, అన్నారాము, రామాంజనేయులు, గుంటక సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా రథసప్తమి పూజలు



రేగడపల్లిలో శ్రీవారికి పూజలు

కొనకనమిట్ల: రథసప్తమిని పురస్కరించుకొని శనివారం మండలంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు చేశారు. నమో వేంకటేశాయా.. నమో నమః అంటూ మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని గొట్లగట్టు కుసుమ హరనాథ స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా శాంతి కల్యాణం జరిపించారు. రేగడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి పూజలు చేశారు. గోవిందా.. గోవిందా.. అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, అభయాంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు చేశారు. వేదపండితులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

దర్శి: పట్టణంలోని నార్త్ పాఠశాలలో రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు వేణు విద్యార్థులతో సూర్య నమస్కారాలు, ఆసనాలు వేయించారు. రథసప్తమి ఆవశ్యకత, సూర్య నమస్కారాలు చేస్తే కలిగే ప్రయోజనాలు వివరించారు. 12 ఆసనాలను 12 మంది ద్వారా చేయించి అవగాహన కల్పించారు. రోజూ ఉదయం సూర్యనమస్కార ఆసనాలు వేస్తే మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వం కలుగుతుందని చెప్పారు.

యర్రగొండపాలెం: స్థానిక కొప్పుకొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రథసప్తమిని భక్తులు వైభవంగా జరుపుకున్నారు. సుదర్శన హోమంలో దంపతులు అశేషంగా పాల్గొన్నారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం నిర్వాహకులు అన్నసంతర్పణ చేశారు.

అసత్య కథనాలపై ఖండన



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

పెద్దదోర్నాల: రాష్ట్రంలోని మంత్రులు వచ్చే ఎన్నికల్లో ఓడిపోతారంటూ ఎల్లో మీడియా కథనాన్ని ఖండిస్తున్నట్లు సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి ఒద్దుల లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి మండల నాయకులతో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఐపాక్ టీం జనవరిలో చేసిన సర్వే అంటూ తప్పుడు కథనాన్ని ఆ పత్రిక ప్రచురించడాన్ని ఆయన తప్పుబట్టారు. తాము ఎటువంటి సర్వే చేయలేదని, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు టీడీపీ, ఎల్లో మీడియా చేసిన కుట్రలో భాగమే ఈ ప్రచారం అంటూ అఫీషియల్ ట్విట్టర్‌లో ఐపాక్ టీం ప్రకటించాన్ని ఆయన గుర్తు చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మంత్రి ఆదిమూలపు సురేష్ ఎదుగుదల చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో కంటే రెట్టింపు మెజార్టీతో గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సర్పంచ్ చిత్తూరి హారిక, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌నాయక్, పరుచూరి శీతారామయ్యతో పాటు సోషల్ మీడియా మండల కన్వీనర్ మొగల్ న్యామతుల్లాబేగ్ పాల్గొన్నారు.

ప్రతి హామీని సీఎం నెరవేర్చారు



మాట్లాడుతున్న సచివాలయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామిరెడ్డి

బేస్తవారిపేట: పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నేటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారని సచివాలయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట రామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక నీలం సంజీవరెడ్డి బజార్‌లోని 1998 డీఎస్సీ రాష్ట్ర నాయకుడు మోర్తాల బాలిరెడ్డి గృహం వద్ద మాట్లాడారు. 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల దశాబ్దాల కల నెరవేర్చారన్నారు. జిల్లాల్లో ఖాళీల సమస్యతో కొంతమేర నియామకాల ప్రక్రియ ఆలస్యం అవుతోందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో చరిత్రలో ఏ రాష్ట్ర సీఎం చేయని సాహసాన్ని జగన్ అన్న చేశారన్నారు. 1.30 లక్షల మందికి సచివాలయ ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం స్కేల్ డిక్లరేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ చేశారన్నారు. కరోనాతో ఆర్థిక సమస్యలు తలెత్తుతాయని అనేక మంది చెప్పినప్పటికీ 98 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చినమాటకు కట్టుబడి ఉద్యోగాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతిపక్షాలు ప్రతి చిన్న విషయాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేపట్టాయని తెలిపారు.

అంకితభావంతో సేవ చేయాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత



ఖాదర్ మస్తాన్‌బీని సన్మానిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

తాళ్లూరు: ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తే గుర్తింపు ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత అన్నారు. బెస్ట్‌ఫ్యామిలీ ఫిజీషియన్ అవార్డు పొందిన వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీకి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఘన సన్మానం చేశారు. మాధవీలత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను ప్రవేశ పెట్టిందని, అందులో వైద్యులు, సిబ్బంది కలిసి కట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మన్నేపల్లిలో ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డు పొందిన వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీతో పాటు సేవలు అందించిన వైద్యులు హనుమానాయక్, ఎంపీహెచ్ఎస్ కోటేశ్వరి, ఎంపీహెచ్ఏ బాల సుబ్రహ్మణ్యం, ఆరోగ్య కార్యకర్త మేరీ, ఆశ కార్యకర్తలు ప్రేమలీల, విజయ నిర్మల, రమణమ్మ, 104 సిబ్బంది నిరంజన్, రవివర్మలను ఘనంగా సన్మానించారు.

263 మందికి వైద్య పరీక్షలు



పెద్దదోర్నాల: రోగికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో శనివారం క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 63 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అందులో క్యాన్సర్‌తో బాధపడుతున్న తొమ్మిది మందికి ప్రత్యేక పరీక్షలు చేసి ఒంగోలులోని హెచ్‌సీజీ ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ సెంటర్‌కు రిఫర్ చేశారు. క్యాన్సర్ వైద్యనిపుణులు కె.సాయికృష్ణ రోగులకు పరీక్షలు చేశారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్రావు పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో...

పెద్దదోర్నాల: సన్నిధి రాజారావు హేమ ఆదరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరాన్ని సర్పంచ్ చిత్తూరి హారిక శనివారం ప్రారంభించారు. వైద్య శిబిరంలో కర్నూల్‌కు చెందిన అమీలియా వైద్యశాల వైద్యులు రమేష్, మహేష్‌లు 200 మంది రోగులకు పరీక్షలు చేశారు. వారిలో శస్త్ర చికిత్సల కోసం 60 మందిని ఎంపిక చేసి వారిని కర్నూలుకు తరలించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, గంటా గురవారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, వెన్నా కాశిరెడ్డి, గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌నాయక్, పరుచూరి శీతారామయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి మేరీసారా దానమ్మ

గిద్దలూరు రూరల్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారా దానమ్మ అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా అక్రమ రవాణ నిరోధక కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో నిర్వహించగా మాట్లాడారు. డ్రగ్స్, ఆయుధాలు తరువాత ప్రపంచంలో మూడో అతిపెద్ద వ్యవస్థీకృత నేరంగా మానవ అక్రమ రవాణా అవతరించిందన్నారు. 46 శాతం మహిళలు, 19 శాతం అమ్మాయిలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. మహిళ రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయని గుర్తు చేశారు. అనంతరం సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని ఖైదీలకు ఏర్పాటు చేసిన వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ప్రసాద్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమణమ్మ, న్యాయవాదులు సిద్దయ్య, పిచ్చయ్య, పారా లీగల్ వలంటీర్ మధు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి వారు

మార్కాపురం: పట్టణ శివారు గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు ఫిబ్రవరి 3 వరకు జరుగుతాయని దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మాలకొండ నరసింహారావు, ఆర్‌కేజే నరసింహం తెలిపారు. స్వామి వారికి శనివారం తోమాల సేవ, అర్చన తదితర విశేష పూజలు చేశారు. ఆదివారం స్వామి వారు శేష వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ నెల 30న హనుమంత వాహనం, 31న స్వామి వారి బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామి వారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా రేషన్ అందించాలి



మాట్లాడుతున్న డీఎస్‌ఓ ఉదయభాస్కర్

పొదిలి రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిత్యావసరాలు పంపిణీ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్ అన్నారు. శనివారం పొదిలి రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, డీలర్లు, ఎండీటీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రేషన్ పారదర్శకంగా, సక్రమంగా, సకాలంలో అందించాలని సూచించారు. గ్రామ స్థాయిలో వీఆర్వోలు, ఎండీటీలు, డీలర్లు సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

దేవస్థానం వసతి గదుల నిర్మాణానికి చేయూత



విరాళం అందిస్తున్న మారం వెంకటరెడ్డి

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని ఆలయ పరిశరాల్లో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వసతి గృహాలకు వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ హ్యాట్రిక్ చైర్మన్ మారం వెంకటరెడ్డి రూ.3 లక్షల విరాళం అందించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఆలయ ఆర్ఏ కోట శ్రీనివాసరావులకు శనివారం నగదు అందించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు చేయూత ఇస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ కార్యదర్శి యాడిక యలమందారెడ్డి, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు పూనూరి దేవదానం పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే జరిమానా

దర్శి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సీఐ రామకోటయ్య సూచించారు. శనివారం అద్దంకి రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. సీఐ రామకోటయ్య మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు సెక్యూరిటీ గార్డులు వేసుకుంటున్నామని, మన ప్రాణాలకు హెల్మెట్ కొనుగోలు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 50 వాహనాలకు నలుగురు కూడా హెల్మెట్ పెట్టుకోవడం లేదన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.1000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఎస్ఐ రామకృష్ణ హెల్మెట్‌ల్లో కంపెనీల గురించి వివరించారు. పీసీ రఘు పాల్గొన్నారు.